పేద ప్రజల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- శ్రీనివాసపురంలో గడపగడపకు మన ప్రభుత్వం


శ్రీనివాసపురంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి వారు అందుకున్న పథకాలను, పొందిన లబ్ధిని వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిపై కొంత మంది ప్రబుద్ధులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. శ్రీనివాసపురంలో చేసిన అభివృద్ధిని సచివాలయం వద్ద ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించామని వాటిని చూసి ప్రతిపక్షాలు తెలుసుకోవాలని అన్నారు. ప్రజల మనస్సుల్లో జగన్‌మోహన్‌రెడ్డి కొలువై ఉన్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాయన్నారు. గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కారం చూపుతున్నామని ఎలీజా అన్నారు. శ్రీనివాసపురంలో డ్రైనేజీల నిర్మాణం, 3 ఇంటర్నల్ రహదారులు నిర్మించాలని ప్రజలు కోరారని, ఈ సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎలీజా అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చింతలపూడి నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారణ


ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా


కుంకాలలో దోమల నివారణ మందు పిచికారీ


చింతలపూడిలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ

చింతలపూడి: సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించగలమని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి నెరుసు వెంకటరామారావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం అవగాహన ర్యాలీని చింతలపూడిలో నిర్వహించారు. యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో డెంగీ వ్యాధిపై అవగాహన పెంపొందించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నెరుసు వెంకట రామారావు, పీహెచ్ఎన్ రమణమ్మ, హెచ్‌వీ పరిమళ కుమారి, ఎంపీహెచ్ఏ మేల్, ఫీమేల్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ దినోత్సవం

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలోని కుంకుకాల గ్రామంలో జాతీయ డెంగీ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు మాట్లాడుతూ డెంగీ వ్యాధి లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో జి.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, సర్పంచ్ కోటం గంగాదేవి, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ డెంగీ దినోత్సవం

టి.నరసాపురం: మండలంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. టి.నరసాపురం మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ అధ్వర్యం వహించారు. ప్రతి శుక్రవారం గ్రామ స్థాయిలో డ్రై డే ఫ్రైడే నిర్వహిస్తున్నామని, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్.తిరుపతిస్వామి, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: జాతీయ డెంగీ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధిని అరికట్టి, వాటిని నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ కె.విజయకృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంటి ఆవరణలో టైర్లు, పూల కుండీల్లో, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. టైగర్ దోమగా పిలిచే డెంగీ దోమ మంచినీటిలో గుడ్లు పెడుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో ర్యాలీ

జంగారెడ్డిగూడెం రూరల్: మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చింతలపూడి శాసన సభ్యులు ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీనివాసపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామ స్థాయిలోనే వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే డెంగీ నివారణకు మార్గం

చింతలపూడి: పరిసరాల పరిశుభ్రతే డెంగీ నివారణకు ఉత్తమ మార్గమని చింతలపూడి నగరపంచాయతీ కమిషనర్ ఎస్ఆర్ బాబు తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో శానిటేషన్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బందితో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధికారులకు, సిబ్బంది ప్రజలు సైతం సహకరించాలని కోరారు.

చెరువులో చనిపోయిన చేపల తొలగింపు


ద్వారకాతిరుమల మండలం వేంపాడు చెరువులో చనిపోయిన చేపలు

ద్వారకాతిరుమల: చెరువులో చనిపోతున్న చేపల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేక పోతున్నామంటూ మండలంలోని వేంపాడు గ్రామస్తులు మంగళవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఎస్సై టి.సుధీర్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించడంతో వివాదం సద్దుమణిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. గ్రామంలోని ఊరచెరువులో చేపల పెంపకం జరుగుతోంది. నాలుగు రోజుల నుంచి అందులోని చేపలు చనిపోతున్నాయి. వాటిని బయటకు తీయకుండా చెరువులోనే విడిచిపెట్టడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు ఆ చెరువు వద్ద నిత్యం 150 మంది వరకు కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. దాంతో దుర్వాసనను భరించలేక పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు కూలీలు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో కొందరు ఉపాధి కూలీలు దీనిపై ఏలూరు స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం చెరువు వద్దకు మంగళవారం అధికారులు వస్తారని ఉపాధి కూలీలు, గ్రామస్తులు ఉదయం నుంచి చెరువు వద్దే ఉన్నారు. ఎంతకీ అధికారులు రాకపోవడంతో వారు చెరువు వద్దే ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. చనిపోయిన చేపలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

ధ్వజ స్తంభానికి ఇత్తడి తాపడం పనులు


మదనగోపాల స్వామి ఆలయ ధ్వజ స్తంభానికి తాపడం చేసేందుకు సిద్ధమైన ఇత్తడి రేకులు

కొయ్యలగూడెం: నూతనంగా పునర్నిర్మించిన కొయ్యలగూడెంలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభానికి ఇత్తడి తాపడం పనులు ప్రారంభించారు. పీఠంతో సహా యాభై అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించిన సోము కర్రకు 260 కేజీల ఇత్తడిని రేకులుగా తయారు చేశారు. ఇత్తడి తాపడం వల్ల ధ్వజ స్తంభం దీర్ఘకాలం మన్నిక ఉంటుందని, దీంతో భక్తులు 180 కేజీల తమ ఇంటిలోని పాత ఇత్తడిని కానుకలుగా సమర్పించారన్నారు. మిగిలిన 80 కేజీలను దేవస్థానం ఖర్చుతో సిద్ధం చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి తెలిపారు. దాదాపు రెండు 250 ఏళ్ల ప్రాశస్త్యం కలిగిన మదన గోపాలస్వామి ఆలయం పునః ప్రారంభోత్సవం ఇటీవల నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిరువూరి శ్రీనివాస్, కొల్లూరు వీరభద్రరావు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్క్‌లో ఆట పాటలతో సందడి


శ్రీవారి కొండపైన చిల్డ్రన్స్ పార్క్‌లో బాతు బొమ్మలపై కేరింతలు కొడుతున్న చిన్నారులు


జారుడు బల్లపై చిన్నారి

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన చిల్డ్రన్స్ పార్క్‌లో చిన్నారులు సందడి చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు పిల్లల కేరింతలు, వారి ఆట పాటలతో ఆ ప్రాంతం సందడిగా మారుతోంది. సాయంత్రం కాస్త వాతావరణం చల్లబడిన తరువాత కొండపైన పార్క్‌కు స్థానికులు, ఆలయానికి వచ్చిన భక్తులు చిన్నారులను తీసుకొచ్చి ఆడిస్తున్నారు. దాతల సహకారంతో దేవస్థానం ఏర్పాటు చేసిన ఈ పార్క్ పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, దీన్ని మరింత అభివృద్ధి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కుకునూరు: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కుకునూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనుగౌడ్ అశ్వారావుపేట నుంచి తన వాహనంలో కుకునూరుకు వస్తుండగా, నందిపాడు వద్ద గోతిని తప్పించే క్రమంలో వాహనాన్ని చెట్టుకు ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీనును 108 వాహనంలో కుకునూరు తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలం తరలించారు.

ప్రచండ భానుని మహోగ్రరూపం


కొయ్యలగూడెం-పోలవరం రోడ్డులో మధ్యాహ్నం దుకాణాలను మూసివేసిన వ్యాపారులు


కొయ్యలగూడెంలో నిర్మానుష్యంగా గణేష్ సెంటర్

కొయ్యలగూడెం: భానుడి ఉగ్రరూపానికి ప్రాణికోటి విలవిలలాడుతోంది. మంగళవారం 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఇళ్లను వదిలి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఉదయం పది గంటల నుండి ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరడంతో నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే గణేష్ సెంటర్ నిర్మానుష్యంగా మారింది. రద్దీగా ఉండే పోలవరం రోడ్డులోని దుకాణాలు మూతపడ్డాయి. వేడిగాల్పులకు భయపడి దుకాణదారులు షాపులను మూసివేసి ఇళ్లకు పరిమితం అయ్యారు. ఐదు గంటల దాటిన తర్వాత కూడా భానుడు చల్లబడకపోవడంతో ప్రజలు తన దైనందిక కార్యక్రమాలను ఆరు గంటలు దాటిన తర్వాత ప్రారంభించారు. మరో మూడు రోజులు ఇదే ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని విపత్తుల శాఖ ప్రకటించడంతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

కుక్కునూరు: నిర్వాసితుల సమస్యల షరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను వెంకటాపురం గ్రామస్తులు కలిసి పోడు భూముల సమస్యను వివరించారు. దీంతో బాలరాజు అమరవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. నిర్వాసితులు పోడు భూములకు పట్టాలు కావాలని కోరడం లేదని పోలవరం ప్యాకేజీ ఇచ్చి తరలించే వరకు పోడు భూములను సాగు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని వివరించారు. ఆర్అండ్ఆర్ పరిహారం అందించి నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించే వరకు సాగు చేసుకునే పోడు భూముల జోలికి వెళ్లొద్దని అటవీ శాఖాధికారులను ఆదేశించారు. కుక్కునూరు-బూర్గంపాడు ఆర్అండ్‌బీ రహదారి గోతులతో ప్రయాణించేందుకు వీలులేకుండా ఉందని, మెడికల్ ఎమర్జెన్సీ వస్తే ప్రాణాలు గాల్లో దీపాలుగా మారయంటూ స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణ పనుల జాప్యం విషయమై బాలరాజు మండలానికి వచ్చిన ఆర్అండ్‌బీ డీఈ హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. హెడ్ ఆఫ్ ద అకౌంట్ విషయమై ఆర్థిక శాఖలో సమస్యలుండడం కారణంగా నిర్మాణ పనులు నిలిచాయని డీఈ వివరించారు. సమస్య పరిష్కారం అయ్యేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని, తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, వైఎస్ ఎంపీపీ తాండ్ర రాజేష్ ఇంటికి వెళ్లి రమణారెడ్డి కుమార్తె రక్షితారెడ్డి దంపతులను, రాజేష్ కుమార్తెలారిసను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైఎస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కువ్వర్లపాటి నరసింహరాజు, నాయకులు రావు వినోద్, చిన్న నరసింహరాజు, పోలగాని వెంకట్రావు, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, నకిరికంటి నరసింహరావు, ఆచంట మాధవరావు, కోటగిరి ప్రజ్వల్ కుమార్, సర్వా శ్రీహరి, సర్పంచ్ తుర్సం నరేష్, సూర్ల రాము, మల్లేల చంటినాయుడు, చేబ్రోలు ఫరీద్ పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారి ఆలయ 4వ వార్షికోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. మంగళవారం ఆలయంలో పూజలు నిర్వహించారు. వార్షికోవాలు 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17వ తేదీ బుధవారం ఆలయంలో గణపతిపూజతో కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు పరిమి వెంకట్రావు, శ్రీలక్ష్మి దంపతులు రూ. 10,116 విరాళంగా అందించినట్లు తెలిపారు. దాతలను అమ్మవారి చిత్రపటంతో సత్కరించారు. ఆలయ ప్రధానార్చకులు మనోజ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్దిలో నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమజ్జయంతి సహిత కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉపాలయంలో కొలువై ఉన్న అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలిసిన సందీప్


ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుచున్న సందీప్

లింగపాలెం: రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సొంగా సందీప్ మంగళవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత సొంగా సందీప్‌ను రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా ఇటీవల నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సందీప్ తాడేపల్లి లిడ్ క్యాప్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సందీప్ ఈపదవిలో రెండేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా సందీప్ ధర్మాజీగూడెంలో మాట్లాడుతూ ఈ పదవి కేటాయించిన సీఎం వైస్ జగన్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సందీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఎమ్మెల్యే తెల్లం బాలరాజును కలిసిన డీఎస్పీ శ్రీనివాసులు

బుట్టాయగూడెం: పోలవరం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఏ. శ్రీనివాసులు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మండలంలోని దుద్దుకూరులో క్యాంప్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఎమ్మెల్యే బాలరాజు అభినందించారు. అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను ప్రకాశం జిల్లా ప్రత్తికొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చానని తెలిపారు. పోలవరం సీఐ కె. విజయబాబు ఆయన వెంటున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అశ్వారావుపేట రోడ్డు రాజులకాలనీ ముఖద్వారంగా వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం 1,500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఉల్లిపాయల హోల్ సేల్ వ్యాపారి పోలిరెడ్డి వెంకట సత్యనారాయణ (పీవీయస్) కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారం, వ్యాపారి చిన్న కూరగాయలు, దాతలు బియ్యం, మంచినీరు అందించారని చెప్పారు. వృద్ధాశ్రమానికి, వికలాంగుల ఆశ్రమానికి ప్రతివారం అన్నప్రసాదాన్ని పంపుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు పీవీయస్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. గండికోట బాబి (పాలబాబి), వెలగల సత్యనారాయణ, మాడా ప్రవీణ్, కొండూరి రామమోహనరావు, శివ, శ్రీధరాల గంగాదర్, ఇందిర, చిన్నారి, వీరబాబు, భారత్ గ్యాస్ బుజ్జి, రామారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

చిన్నతిరుపతికి చేరిన సైకిల్ యాత్రికుడు


చిన్నతిరుపతిలో విజయగోపాలకృష్ణ

ద్వారకాతిరుమల: దేశ శాంతి, జల, జంతు, వన సంరక్షణ కోరుతూ కర్నాటక రాష్ట్రం, రాయచూరు జిల్లా సింధనూరుకు చెందిన చాట్రాజుల విజయ గోపాలకృష్ణ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి చేరుకుంది. గతేదాది మార్చి 11న సింధనూరులో ప్రారంభమైన ఈ దైవదర్శన సైకిల్ యాత్ర 15 రాష్ట్రాలను చుట్టి ఇప్పుడు చిన్నతిరుపతికి చేరింది. పూరీలోని జగన్నాథుని ఆలయం నుంచి బయల్దేరి తాను మార్గ మధ్యలోని పలు ఆలయాలను సందర్శిస్తూ ఇక్కడికి వచ్చినట్టు గోపాలకృష్ణ తెలిపారు. కాశీ నుంచి రామేశ్వరం వరకు తన యాత్ర సాగుతుందన్నారు. తన సొంతూరు తణుకు మండలం కొమ్మరవరమని, కర్నాటకలోని సింధనూరులో స్థిరపడినట్టు చెప్పారు.

సామాజిక న్యాయం ఎంఎస్‌పీతోనే సాధ్యం

టి.నరసాపురం: సామాజిక న్యాయం మహాజన సోసలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ)తోనే సాధ్యమని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి వి.సిద్దుమాదిగ అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో మంగళవారం ఎంఎస్‌పీ గో టు విలేజ్ 50 డేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నార్లపాటి వంశీ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ స్థాపించిన ఎంఎస్‌పీ అధికారంలోకి రావాలన్నారు. పోలవరం నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ లంకా జైబాబు, టి నరసాపురం ఎంఎంఎస్ కన్వీనర్ కొమ్ము కూరు సుగుణ ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

కామవరపుకోట: స్థానిక కామవరపుకోట శాఖా గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగా, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ శాఖ అధికారి భీమరాజు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక వేసవి శిక్షణ శిబిరం నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప, సహాయకురాలు బట్టు మణి తదితరులున్నారు.

ప్రజలపై ధరల భారం

జంగారెడ్డిగూడెం: దేశ ప్రజలపై ధరల భారం మోపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాలని సీపీఎం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం రోటరీ కమ్యూనిటీ హాల్లో సీపీఎం పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, బి.తులసీదాస్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాదు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలందరినీ మోసం చేసిందని, సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో సీపీఐ పార్టీ కార్యాలయ వద్ద మంగళవారం మండల కౌన్సిల్ సమావేశాన్ని మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, తాడిగడప ఆంజనేయరాజు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

దివి హరిణి W/o వెంకట గిరిబాబు అనునేను తిమ్మాపురం వాసిని. నాకు పాస్‌పోర్టు కలదు. నా పాస్‌పోర్టు నెంబరు M6836722. నేను నా పాస్‌పోర్టుతో నా బైక్‌మీద ద్వారకా తిరుమల వెళ్ళుచుండగా పడిపోయినది. కావున దొరికిన వారు దయతో 93904 66669 అను నెంబరుకి తెలుపగలరు.